జోరుగా జీరో దందా



మద్నూర్ మండలంలోని జిల్లా సరిహద్దులో మహారాష్ట్ర నుంచి ట్రక్కుల కొద్దీ లారీల్లో సరుకులు జిల్లాకు వస్తున్న దృశ్యాలు

- జిల్లా మీదుగా జోరుగా అక్రమ సరుకుల రవాణా
- సరిహద్దు ప్రాంతాలు దాటి వస్తున్న అక్రమ సరుకులు
- బిల్లులు లేకుండానే సరుకులను తరలిస్తున్న వ్యాపారులు
- ఎస్టిమేషన్ బిల్లులతో అక్రమ వ్యాపారాలకు తెర లేపుతున్నారు
- కనిపించని వాణిజ్య పన్నుల, రవాణా శాఖల తనిఖీలు
- సరిహద్దుల్లో నామ మాత్రంగానే ఆర్టీఏ చెక్‌పోస్టులు
- పన్ను రుసుములతో వచ్చే ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వ్యాపారులు

కామారెడ్డి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పక్క రాష్ట్రాల నుంచి అక్రమ సరుకులు సరిహద్దులు దాటి జిల్లాలోకి వస్తున్నాయి. అదే విధంగా జిల్లా మీదుగా అక్రమ సరుకులను అక్రమార్కులు సరిహద్దులను దాటించేస్తున్నారు. ఇలా అక్రమ సరుకులకు ఎలాంటి బిల్లులు లేకుండా ఇతర రాష్ట్రాల సరుకులు ప్రైవేటు వాహనాలదారులు తరలిస్తూ జోరుగా అక్రమ రవాణా కొనసాగిస్తు జీరో దందా చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కామారెడ్డి జిల్లాకు రావడం, ఈ జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు బిల్లులు లేని సరుకులను అక్రమంగా రవాణ చేస్తున్నారు. ప్రధానంగా జిల్లా సరిహద్దుల్లో వాణిజ్య పన్నుల శాఖ చెక్‌పోస్టులు ఎత్తివేయడంతో అక్రమ వ్యాపారులు రెచ్చిపోతున్నట్లు తెలుస్తోంది. ఎస్టిమేషన్ బిల్లులతో అక్రమ సరుకుల తరలింపునకు వ్యాపారులు తెరలేపినట్లు తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి సరుకులతో ఎలాంటి బిల్లులు లేకుండా ట్రక్కుల కొద్ది వందలాది లారీలు, కంటైనర్‌లు వస్తూ పోతున్నాయి. దీంతో పన్నుల రూపేనా ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది నిధులకు వ్యాపారులు గండికొడుతున్నారు.

జిల్లా మీదుగా అక్రమ రవాణా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి సిమెంట్, మార్బుల్, టైల్స్, ఐరన్ పెద్ద ఎత్తున జిల్లాకు దిగుమతి అవడమే కాకుండా జిల్లా మీదుగా అక్రమంగా రాష్ట్ర రాజధానికి, ఇతర జిల్లాలకు రవాణా చేస్తున్నారు. మహారాష్ట్ర, కర్నాటక నుంచి ఎలక్ర్టానిక్, గృహోపకార, ప్లాస్టిక్ సామగ్రి వస్తువులను కూడా పన్నులు చెల్లించకుండానే జిల్లాకు తరలిస్తున్నారు. గతంలో కామారెడ్డి జిల్లా సరిహద్దులో అక్రమంగా వేరేరాష్ట్రం నుంచి సరుకులను ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తుండగా సంబంధిత శాఖ అధికారులు పట్టుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణ శివారులో పలు బ్రాండెడ్ కంపెనీలకు చెందిన టైల్స్‌షోరూం నిర్వాహకులు గుజరాత్ నుంచి వందల లారీల లోడ్‌లలో ఎలాంటి బిల్లులు లేకుండా టైల్స్ మార్బుల్స్‌ను రాత్రులకు రాత్రే జిల్లాకు తరలిస్తున్నట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి. ఇలా వ్యాపారులు ప్రభుత్వానికి ఎలాంటి పన్నులు చెల్లించకుండా జోరుగా సరుకుల, వస్తువులు అక్రమ రవాణా దందాను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా వాణిజ్య పన్నుల శాఖ, ఇతర శాఖల అధికారులు ఈ జీరో దందాపై, అక్రమ రవాణా సరకుల తరలింపుపై నిఘా పెట్టి అడ్డుకట్ట వేయాల్సిన అవసరమెంతైనా ఉంది.

బిల్లులు లేకుండానే వస్తువులు, సరుకుల తరలింపు

జిల్లాలోకి ఇతర రాష్ట్రాల నుంచి ఎలాంటి బిల్లులు లేకుండానే వ్యాపారులు యథేచ్ఛగా ప్రతీ రోజు వందల సంఖ్యలో ట్రక్కులు, లారీల్లో సరకులను తరలిస్తున్నారు. జిల్లా నుంచి నిత్యం 120 నుంచి 200 వరకు సిమెంట్ లారీలు, 50 లారీల మార్బుల్‌లు, టైల్స్, వందలాది వాహనాల లోడ్‌ల పప్పు దినుసులు, విత్తనాలు, ఎరువులు, 15 లారీల్లో ప్లాస్టిక్ వస్తు సామగ్రి, 10 లారీల్లో ఎలక్ర్టానిక్ వస్తువులు వస్తుంటాయి. ఇలా ఏపీ పన్నులు చెల్లించకుండానే సరిహద్దులు దాటించేస్తున్నారు. అక్రమ రవాణాపై గతంలో వాణిజ్య పన్నుల శాఖ తనిఖీలు ఉండేవి. అడ్డదారుల్లో మహారాష్ట్ర నుంచే కాకుండా కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కామారెడ్డి జిల్లా మీదుగా రాష్ట్ర రాజధానికి అక్రమ సరుకులు తరలిస్తున్నారు. ప్రధానంగా మహారాష్ట్ర నుంచి రాష్ట్ర రాజధానితో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు ఏ వస్తువులు తరలుతున్నాయని ఎవరైనా అడిగితే పాత ఇన్వాయిస్‌లనే చూపడం పరిపాటిగా మారింది. జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయలు పన్ను రూపంలో వచ్చే ఆదాయం ప్రభుత్వాలు నష్టపోవాల్సి వస్తోంది.

నిబంధనలకు పాతర

నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి సరుకులకు ఎలాంటి బిల్లులు లేకుండా జిల్లాకు దిగుమతి చేసుకుంటున్నారు. ప్రధానంగా కామారెడ్డి జిల్లాలో పలువురు వ్యాపారులు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నుంచి పెద్ద మొత్తంలోనే పప్పుదినుసులతో పాటు విత్తనాలు, ఎరువులు, ప్లాస్టిక్, ఎలక్ర్టానిక్ సరుకులు, వస్తువులను దిగుమతి చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏ సరుకును అయినా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తీసుకువెళ్లాలంటే బిల్లులు, వే బిల్లులు తప్పనిసరి. జీఎస్టీ అమల్లోకి వచ్చాక వే బిల్లులతో సరుకుల రవాణా చేయాలని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో వ్యాపారులు ఈ నిబంధనలు పాటించడం లేదు. ఎలాంటి బిల్లులు లేకుండా నిత్యం 120 నుంచి 200 లారీల వరకు వివిధ రకాల సరుకులు, వస్తువులను జిల్లాల నుంచి పొరుగు రాష్ట్రాలకు చేర్పుతుండగా, అక్కడి నుంచి సుమారు 200 లారీల్లో వివిధ సరుకులు ఇక్కడికి వస్తున్నాయి. సరిహద్దుల వద్ద తనిఖీలు లేకపోవడం, ప్రైవేట్ బస్సులు, వాహనాలను మార్గమధ్యలో నిలిపి వాణిజ్యపన్నుల శాఖాధికారులు తనిఖీలు చేయకపోవడంతో సరిహద్దులు దాటి అక్రమ సరుకు రవాణా జోరుగా సాగుతోంది. దీంతో ప్రభుత్వానికి పన్నుల రూపేనా రావాల్సిన కోట్లాది రూపాయలకు గండిపడుతోంది.

కనిపించని ఆర్‌టీఏ, వాణిజ్య పన్నుల శాఖ తనిఖీలు

జీఎస్టీ అమల్లోకి వచ్చాక జిల్లాలోని మద్నూర్ సరిహద్దుల్లో వాణిజ్య పన్నులశాఖల చెక్‌పోస్టులను ఎత్తివేశారు. మహారాష్ట్ర నుంచి మద్నూర్ మీదుగా 161 జాతీయ రహదారి కావడంతో అక్రమ రవాణా మరింత జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు రోడ్లపై వాణిజ్య పన్నుల, ఆర్‌టీఏ శాఖాధికారులు సరుకులు తరలించే వాహనాలను తనిఖీలు చేయకపోవడంతో ఇదే అదనుగా భావించి మరింత రెచ్చిపోతున్నారు. కానీ ఈ ప్రాంతంలో ఆర్‌టీఏ చెక్‌పోస్టులు ఉన్నవారు మామూళ్లు తీసుకుంటూ ఆ వాహనాలను వదిలిపెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్డుపైకి లోడ్‌తో లారీ వచ్చిందంటే వే బిల్లు, ఇన్వాయిస్ తప్పనిసరి. కానీ వ్యాపారులకు ఈ విషయం తెలిసినా వాణిజ్యపన్నుల, ఆర్‌టీఏ శాఖాధికారులు తనిఖీలు లేవనే ధీమాతో పాటు చెక్‌పోస్టులు లేకపోవడంతో సరుకులను ఎగుమతి, దిగుమతి చేస్తూ జీరో దందా చేస్తున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండానే సరుకులను దిగుమతి, ఎగుమతులు చేస్తున్నారు. గతంలో తనిఖీ కేంద్రాలు ఏదైనా వాహనం తనిఖీ చేయించుకోకుండా వెళితే అలాంటి వాటిని నిషేధిత జాబితాలో పెట్టేవారు. ఇప్పుడు దర్జాగా సరుకులను అక్రమంగా తరలిస్తూ పన్నులు ఎగవేస్తున్నారు. ఇలా నిత్యం వందలాది లారీలు సరుకులతో అక్రమంగా రవాణా జరుగుతున్నా పట్టించుకునే వారే లేకపోయారు.



మద్నూర్ చెక్‌పోస్టు ముందు నుంచి వెళుతున్న భారీ వాహనాలు





కామారెడ్డిలో కామదహనం చేస్తున్న దృశ్యం

జిల్లాలో ఘనంగా కాముని దహనం

కామారెడ్డి టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాముని దహనం వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగకు ఒక రోజు ముందు రాత్రి కాముని దహనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. దాంట్లో భాగంగా కామారెడ్డిలోని అశోక్‌నగర్ చౌరస్తా, పెద్దబజార్, భారత్‌రోడ్డు చౌరస్తా, జేపీఎన్ రోడ్డు చౌరస్తా, పంచ్ చౌరస్తా, రామారెడ్డి రోడ్డు చౌరస్తా, పాత బస్టాండ్ చౌరస్తా, ఇంద్రానగర్ కాలనీ, రాజీవ్ నగర్ కాలనీ, మున్సిపల్ చౌరస్తా, ఆర్కేలాడ్జ్ రోడ్డు చౌరస్తా, బీడీ వర్కర్స్ కాలనీల్లో ఆయా కాలనీవాసులు కాముని దహనాన్ని నిర్వహించారు. పిడకలతో కట్టెలను పేర్చి నెయ్యిని పోస్తూ కామదహన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా హోలీ పండుగ వేడుకలను జరుపుకోనున్నారు. హోలీ పండుగ వేడుకలకు జిల్లాలోని యువకులు, విద్యార్థులు ఘనంగా జరుపుకునేందుకు సంసిద్ధమయ్యారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో, పట్టణాల్లో హోలీ వేడుకలను జరుపుకోనున్నారు.

హోలీని ఆనందంగా జరుపుకోవాలి

• ఎస్పీ రాజేష్‌చంద్ర

ప్రజలు హోలీ పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలి. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలు, మద్యం మత్తులో వాహనాలు నడపడం చేయరాదు. హోలీ పండుగ సందర్భంగా ఫేస్‌బుక్‌లో గాని, ఇన్‌స్ర్టాగ్రామ్‌లో గాని, మరే విధమైన సోషల్ మీడియా సైట్లలో వచ్చే అసత్యప్రచారాలను నమ్మకూడదు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హోలీ పండుగ జరుపుకోవాలి. సురక్షిత మైన రంగులనే ఉపయోగించాలి. ఇష్టపడని వ్యక్తులు, ప్రదేశాలు, వాహనాలపై రంగులు లేదా రంగునీటిని విసరడం నిషేధించబడింది. పబ్లిక్ రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఇతరులను ఇబ్బంది పెట్టడం, అసభ్యంగా ప్రవర్తించడం మద్యం మత్తులో అల్లర్లు చేయడం చట్టవిరుద్ధం.

ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రబీ 2024-25 సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రబీ సీజన్‌లో 2,61,110 ఎకరాల్లో రైతులు వరి ధాన్యం సాగు చేశారని, ఇందులో 57,445 ఎకరాల్లో సన్న రకం, 2,03,665 ఎకరాల్లో దొడ్డు రకం వరిని రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఇందులో 4,88,796 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 1,32,121 మెట్రిక్ టన్నుల సన్న రకం వరి ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. జిల్లాలో వరి కొనుగోళ్లకు 424 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందులో 27కేంద్రాలు మహిళా సంఘాలు, 397 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సన్నరకాల వారి కొనుగోలుకు 63 కేంద్రాలు, దొడ్డు రకం కొనుగోలుకు 334 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్, ఆటోమేటిక్ వరి ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు, తూకం వేసే స్కేల్, పాడి డ్రయ్యర్స్, గన్నీ సంచులు తదితర వాటిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. గత ఖరీఫ్‌లో ఎదురైన సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా అవసరమైన ఏర్పాటు, కేంద్రాల పెంపు చేయాలని తెలిపారు. మే చివరి వారంలో వర్షాలు కురిసే ఆస్కారం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. వాతావరణ పరిస్థితుల వివరాలు రైతులకు వివరించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఏఎస్పీ నరసింహారెడ్డి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, ఆర్‌టీవో శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో తిరుమలప్రసాద్, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్‌తో ఏఐని జత చేయడం ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చు

గణిత సామర్థ్యాల సాధన (ఎఫ్‌ఎల్‌ఎన్)తో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ(ఏఐ) జతచేయడం వల్ల అద్భుత ఫలితాలు సాధించవచ్చని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితారాణా తెలిపారు. గురువారం కలెక్టర్‌లు, డీఈవోలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రతీ జిల్లాలో ఏఐ ఆధారిత ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశం తర్వాత కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో 26 ప్రాథమిక పాఠశాలలను ఏఐ ఆధారిత ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమానికి ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ పాఠశాలల్లో ఏఎక్స్ ఎల్‌ల్యాబ్‌లను ఈనెల 15వ తేదీన ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ఎంపిక చేయబడిన ప్రతీ ప్రాథమిక పాఠశాల సమీపంలోని ఉన్నత పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌ను ఉపయోగించుకుని ఒక్కో ఉపాధ్యాయుడికి బాధ్యత అప్పగించి విద్యార్థులకు ఏఐ ఆధారిత విద్యా బోధన చేయాలని సూచించారు.

ప్రతిరోజూ 5 లీటర్ల నీటిని తాగాలి



వరల్డ్ కిడ్నీడే కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫరీదా బేగం

కామారెడ్డి టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం వరల్డ్ కిడ్నీడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతీ రోజు 4 నుంచి 5 లీటర్ల నీరు తాగాలని, ఉప్పు, చక్కెర రోజు తినే ఆహారంలో తగ్గించాలని తెలిపారు. నాలుగు నెలలకు ఒకసారి రక్తపరీక్ష చేసుకోవాలని అనవసరంగా నొప్పుల గోలీలు గాని ఇతర చెట్ల మందులు గాని వాడకూడదని తెలిపారు. కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకు 900 నుంచి 1000 మంది వరకు రోగులు సేవలు పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఫరీదాబేగం, డాక్టర్ బన్సీలాల్, వెంకట్, ఆర్‌ఎంవో యాదగిరి, శరత్, నర్సింగ్ సూపరింటెండెంట్ స్వరూపారాణి, డయాలసిస్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ఎస్పీ రాజేష్‌చంద్ర



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఎస్పీ

కామారెడ్డి టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. గురువారం కామారెడ్డి పట్టణంతో పాటు దేవునిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని వాహనాల చెకింగ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి వాహనాలు నడపరాదని, నెంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిలో యువతే ఎక్కువని, ఈ విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను అప్రమత్తం చేయాలని తెలిపారు. లైసెన్స్, నెంబర్ సక్రమంగా లేని, నెంబర్ ట్యాంపరింగ్ కలిగిన, నెంబర్ తొలగించిన వాహనాలను గుర్తించేందుకు తనిఖీలు చేస్తున్నామన్నారు. పట్టుబడిన వాహనాలపై ఆయా పోలీసుస్టేషన్‌లలో కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లా న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ

ఎస్పీ రాజేష్‌చంద్ర గురువారం జిల్లా న్యాయమూర్తి వీఆర్ఆర్ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పెండింగ్ కేసులపై ఇరువు రు చర్చించారు. మద్యం తాగుతూ వాహనాలు నడిపే వారికి, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపేవారికి తగిన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని న్యాయమూర్తి ఎస్పీకి సూచించారు.

అడ్డగోలుగా అడవుల నరికివేత

- సహకరిస్తున్న అటవీ సిబ్బంది
- నామమాత్రంగా కేసులు
- కేసులు చేస్తేనే తమకు లబ్ధి అంటున్న కబ్జాదారులు
- అడవుల నరికివేతతో గ్రామాల్లోకి వస్తున్న వన్యప్రాణులు
- అడవుల నరికివేతను ఆపాలని కోరుతున్న జిల్లావాసులు

లింగంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వందలాది ఎకరాల్లో అడవులు అక్రమంగా కబ్జాకు గురవుతున్నాయి. వేలాది చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. జిల్లాలో 82,130 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. అడవుల నరికివేత ఇలాగే కొనసాగితే మరో పది సంవత్సరాల్లో అడవుల ఆనవాలు లేకుండా పోతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరి స్వార్థం కోసం పూర్తి జనజీవనానికి ఇబ్బంది కలిగే రోజులు వస్తాయని వచ్చే తరాలకు గాలి నీరు లేక ఇబ్బందులు కలుగుతాయని వారు అంటున్నారు. అటవీ అధికారులు చెట్లుంటే క్షేమం-లేకుంటే క్షామం, అడవికి నిప్పు-ప్రగతికి ముప్పు అంటు ప్రచార ఆర్భాటాలే తప్ప క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా కొందరు అవినీతి అటవీ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తున్నారని బహిరంగంగానే ఆయా గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు. ఒక ఎకరాకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు తీసుకుని నామమాత్రంగా కేసులు చేసి చెట్ల నరికివేతకు సహకరిస్తున్నారనే ఆరోపనలు ఉన్నాయి. జిల్లాలోని లింగంపేట, గాంధారి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, సదాశివనగర్, మాచారెడ్డి మండలాల్లో దట్టమైన అడవులు ఉన్నాయి. లింగంపేట మండలంలోని మెంగారం, బోనాల్, ముంబాజీపేట, బాణాపూర్, బాయంపల్లి, నల్లమడుగు, భవానిపేట, మిద్దెమెట్టు, లక్ష్మాపూర్, ముస్తాపూర్, లింగంపల్లి, ఒంటర్‌పల్లి, పోతాయిపల్లి, పొల్కంపేట, మోతె, సజ్జన్‌పల్లి, ఎక్కపల్లి, శెట్పల్లి, శెట్పల్లిసంగారెడ్డి గ్రామాల్లో యథేచ్ఛగా చెట్లను నరికి సాగు భూములుగా మర్చుతున్నారు. గత రెండు సంవత్సరాలుగా జిల్లాలోని వందలాది ఎకరాల్లో లక్షలాదిచెట్లను నరికి అక్రమంగా కబ్జాలకు పాల్పడుతున్నారు. ఎండా కాలంలో చెట్లను నరికి కాల్చివేసి వర్షాలు పడగానే జేసీబీలు, ట్రాక్టర్ల సహాయంతో రాత్రివేళల్లో సాగు చేసి పంటలు వేస్తున్నారనే విషయం తెలిసి అటవీ అధికారులు అడ్డుకుంటే వారికి నజరానాలు ఇచ్చి మచ్చిక చేసుకుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. కొందరు స్మగ్లర్లు టేకు చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని వారు అంటున్నారు. గతంలో ఫారెస్ట్ అధికారులపై ఇందల్వాయి మండలంలో జరిగిన దాడి కారణంగా అటవీ అధికారులు సైతం భయపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి అడవుల నరికివేతపై ప్రత్యేక చట్టం తెచ్చి అడవుల నరికివేతను ఆపాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.



బోనాల్ అటవీ ప్రాంతంలో వందలాది చెట్లను నరికిన దృశ్యం

కేసులు చేయించుకుంటున్న కబ్జాదారులు

గత ప్రభుత్వం కాబ్జాలో ఉన్న భూమిని సాగు చేస్తున్నారా లేదా అట్టి భూమిపై కేసులు ఏమైనా నమోదయ్యాయా అని పరిశీలించి కేసులు నమోదైన కబ్జాదారులకే పట్టాలు ఇవ్వడంతో ఇప్పుడు కొత్తగా కబ్జాలకు పాల్పడుతున్న వారు కావాలని కేసులు చేయించుకుంటు న్నారని అటవీ అధికారులు అంటున్నారు.

అడవుల నరికివేతతో గ్రామాల్లోకి వస్తున్న వన్యప్రాణులు

ఒకప్పుడు దట్టమైన అడవులు ఉండడంతో అడవుల్లో పెద్దపులులు, చిరుతపులులు, ఎలుగుబంట్లు, జింకలు, కుందేళ్లు, నెమళ్లు, ఏదులు, నీల్‌గాయ్‌లు ఇలా ఎన్నో రకాల జంతువులు అడవుల్లో జీవనం సాగించేవి. ఇటీవల యథేచ్ఛగా అడవులు నరికివేయడంతో అడవుల్లో ఉండే జంతువులు గ్రామాల్లోకి వస్తున్నాయి. వేసవి కారణంగా నీటి కోసం దగ్గరలోని పంట చేళ్లలోకి వస్తున్నాయి అలా వచ్చిన వాటిని కరంటు షాకులు పెట్టి, వన్య ప్రాణులను వేటగాళ్లు వేటాడి చంపుతున్నారు. దీంతో వన్యప్రాణుల జీవనం ప్రశ్నార్థకంగా మారింది.

బోనాల్‌లో ఆరుగురిపై కేసులు నమోదు చేశాం

• ఓంకార్, ఫారెస్ట్ రేంజ్ అధికారి

బోనాల్‌లో అక్రమంగా అడవిని నరికి కాబ్జాకు పాల్పడిన ఆరుగురిపై కేసులు నమోదు చేశాం. ఫారెస్ట్ అధికారులు ఎవరైనా కబ్జాదారులకు సహకరించినట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.గత ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూములు తప్పా ఇతర ఫారెస్టు భూముల జోలికి వస్తే కేసులు చేస్తామని ఆయన హెచ్చరించారు.



రుద్రూరులో కామదహనం చేస్తున్న దృశ్యం



డొంకేశ్వర్‌లో ...



కొత్తపల్లిలో కామదహనం నిర్వహిస్తున్న ప్రజలు

జిల్లా వ్యాప్తంగా ఘనంగా కామదహనం.. హోలీ పండుగ

కోటగిరి,మార్చి12(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద బుధవారం రాత్రి సంప్రదాయ పద్ధతిలో హోలీ కామదహనం నిర్వహించారు. పిట్ల కృష్ణ మహరాజ్ ఆధ్వర్యంలో యజ్ఞం, భజనలతో సంప్రదాయబద్ధంగా గోఆధారిత ప్రమీదలను ఆవునెయ్యి వివిధ రకాల వనమూలికలతో కూడిన సామాగ్రితో కామదహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామదహనం రావి, మేడి, జువ్వి, మామిడి, అల్ల నేరెడు, తులసి, తిప్పతీగ, మర్రిలాంటి కర్రలను ఉపయోగించి కామదహనం చేయడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు అనేక రోగాలను నయం చేయవచ్చన్నారు. చెడుపై మంచికి ప్రత్యేకంగా జరుపుకునే ఉత్సవం కామదహనం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పతంజలి సోషల్ మీడియా అధ్యక్షులు విశ్వనాథ్ మహాజన్, రామారావు జోషి, చంద్రశేఖర్, బచ్చురాం, పురుషోత్తం, వెంకటేశం, రామారావు జోషి తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: సిరికొండ మండలం హుస్సేన్‌నగర్ గ్రామంలో గురువారం హోళీ పండగా సందర్భంగా బాలబాలికలు మాత్రమే రంగోళి ఆడుకున్నారు. రంగులు చల్లుకోవడానికి యువకులు, పెద్దలు ఆసక్తి చూపించలేదు. కేవలం చిన్నారులే రంగులు వెద జల్లుకుని సంబరాలను అంబరంగా జరుపుకున్నారు. పిల్లలు ఆనందంగా కేరితంలు కొడుతూ రంగులు చల్లుకున్నారు.

కోటగిరి: కోటగిరి, పొతంగల్ మండలాల్లో పలు గ్రామాలలో గురువారం హోళీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.కోటగిరి, పొతంగల్, ఎత్తొండ గ్రామాలలో బుధవారం రాత్రి కామదహనం నిర్వహించారు. గురువారం ఆయా గ్రామాలలో యువకులు హోలీ సంబరాలను జరుపుకున్నారు.

బోధన్‌రూరల్: సాలూర మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో, బోధన్ మండలంలోని పలు గ్రామాలలో గురువారం హోలీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సార్గమ్మ ఉన్న గ్రామాలలో ఆనవాయితీ ప్రకారం హలీ పండుగను ఆయా గ్రామాల ప్రజలు ముందుగానే నిర్వహిస్తారు. గ్రామాలలో కుల, మతాలకు అతీతంగా చిన్న, పెద్ద తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆలింగనం చేసుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిజామాబాద్ కల్చరల్: రుతు సంబంధమైన పండుగైన హోలీ వేడుకలకు జిల్లా సిద్ధమైంది. ప్రతియేటా పాల్గుణ పౌర్ణమి నాడు హోలీపండుగను జరుపుకుంటారు. రుతు సంబంధమైన వ్యాధులు ప్ర బలకుండా ఈ పండుగలో సహజ రంగులను ఉపయోగించి పండుగను నిర్వహించుకోవడం అనాధిగా వస్తుంది. పురాణాల ప్రకారం హోళిక అనే రాక్షసి పిల్లలను పట్టుకొని భయభ్రాంతులకు గురిచేయడంతో ప్రజలు పౌర్ణ మి నాడు దహనం చేసి మరుసటి రోజున ఎంతో ఘనంగా హోలీ వేడుక లను నిర్వహించుకున్నట్లు తెలుస్తుంది. నాటి నుండి ప్రతియేటా పాల్గున పౌర్ణమి నాడు కామదహనం పేరుతో హోళిక అనే రాక్షసిని దహనం చేసి మరుసటి రోజున రంగులతో హోలీ పండుగను జరుపుకుంటారు. హోలీ పండుగ రోజున ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి పండుగను జరుపుకొని సాయం త్రం ఆత్మీయులతో కలిసి పిల్లలకు పేర్లను వేసి దుష్టశక్తి దరిచేరకుండా రక్షగా ఉండాలని భగవంతున్ని కోరుకుంటారు. హోలీ పండుగ రోజు నుంచి చలి తగ్గుముఖం పట్టి ఎండకాలం ప్రారంభమవుతుంది. అందుకు అను గుణంగా శరీరం శారీరకంగా తట్టుకునే విధంగా రకాల ఆకులతో తయారు చేసిన సహజ సిద్ధమైన రంగులు, మట్టిని చల్లుకోవడం పండుగలో ప్రత్యేకంగా భావిస్తారు.

● లక్ష్మీనారాయణుడికి ప్రత్యేక పూజలు...

పాల్గున పౌర్ణమి నాడు జరుపుకునే ముఖ్యమైన పండుగైన హోలీ పర్వదినాన లక్ష్మీనారాయణుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. లక్ష్మీనారాయణుడిని పూజించడం వల్ల లక్ష్మీ అనుగ్రహం లభిస్తుందని శాస్త్రం చెబుతుంది. ఈ రోజు లక్ష్మీనారాయణుడికి పంచామృత అభిషేకాలు నిర్వహించి పసుపు, కుంకుమ, బుక గుళాలు, గంధంతో వసంతోత్సవం నిర్వహించడం ద్వారా ఏడాది పొడవున స్వామి అనుగ్రహంతో ఆయురారోగ్యంతో ఉంటారని విశ్వసిస్తారు.

● మార్కెట్‌లో హోలీ సందడి

హోలీ పండుగ పురస్కరించుకొని మార్కెట్‌లో సందడి వాతావరణం నెలకొంది. పండుగలో ఉపయోగించే వివిధ రకాల రంగులు అందుబాటులో ఉంచి అమ్మకాలు సాగిస్తున్నారు. హోలీ వేడుకల్లో చిన్నారులకు వేసేకుడకల పేర్లు, బాదాం, చక్కెర పేర్లకు డిమాండ్ పెరిగింది. ప్రధానమార్కెట్‌అయిన గాంధీచౌక్, పెద్దబజార్, వీక్లీ మార్కెట్, రైల్వేస్టేషన్ తదితర దుకాణాలు రద్దీగా మారాయి

ఎడపల్లి: మండలంలోని జానకంపేట, జైతాపూర్, పోచారం, బ్రాహ్మణ్‌పల్లి, జంలం గ్రామాలలో గురువారం హోళీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. అందులో భాగంగా ఆయా గ్రామాలలో బుధవారం కామదహనం చేసి గురువారం హోళీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.హోళీ వేడుకల్లో రసాయన రంగులకు తావీయకుండా గోగుపూలతో తయారు చేసిన రంగులు, గులాలు వాడుతూ చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకుని పండుగను జరుపుకున్నారు.

ధర్పల్లి: ధర్పల్లిలో కామదహన వేడుకలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మనస్సులో ఉన్న కోరికలను దహించేందుకే కామదహన కార్యక్రమాన్ని నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెంజల్: రెంజల్ మండల కేంద్రంతో పాటు సాటాపూర్, బోర్గాం, దూపల్లి, కళ్యాపూర్, నీలా గ్రామాలలో గురువారం హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. బుధవారం రాత్రి కామదహనం చేసి గురువారం హోలీ పండుగ నిర్వహించి ఒకరినొకరు రంగులు చల్లుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.గోగిపూలతో రంగులు తయారు చేసి ఒకరిపై ఒకరు చల్లుకుని ప్రేమ అప్యాయతతో పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, యువత పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండల గ్రామాలలో గురువారం ఘనంగా కామదహనం, హోలీ సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని సార్గమ్మ ఉన్న పలు గ్రామాల్లో బుధవారం రాత్రి కామదహనం నిర్వహించి గురువారం ఆయా గ్రామాల్లో మహిళలు, యువకులు, చిన్నారులు రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. అలాగే పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు రంగులు చల్లుకుంటూ హోలీ వేడుకలను జరుపుకున్నారు. మరికొన్ని గ్రామాల్లో గురువారం రాత్రి కామదహనం నిర్వహించారు. శుక్రవారం హోలీ వేడుకలను జరుపుకోనునారు.

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టపల్లి, ఖిల్లా డిచ్‌పల్లి, సుద్దపల్లి గ్రామాల్లో ఆనందోత్సవాల నడుమ గురువారం హోళీ వేడుకు నిర్వహించుకున్నారు. మిట్టపల్లిలో గ్రామ యువకులు భారీ గుండు రాయిని ఎత్తడానికి పోటీ పడారు. సుద్దపల్లిలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి హోళీ సంబరాల్లో పాల్గొన్నారు. ఖిల్లా డిచ్‌పల్లిలో హోళీ సంబరాలు అంబరాన్ని అంటాయి.

నందిపేట: మండల కేంద్రంతో పాటు బజార్‌కొత్తూర్, దత్తాపూర్, నందిపేట, శాపూర్ తధితర గ్రామాల్లో గురువారం హోలీ నిర్వహించారు. బుధవారం రాత్రి పలు చోట్ల గ్రామస్తులు కామ దహనం చేశారు. మరుసటి రోజు చిన్న పెద్ద, యువతీ యువకులు తేడా లేకుండా రంగులు చల్లుకున్నారు. యువజన సంఘాల సభ్యులు విద్యార్థులు బైక్ ర్యాలీలు నిర్వహించారు. అంతే కాకుండా అక్కడక్కడ డిజేలు ఏర్పాటు చేసి డ్యాన్సులు చేశారు. రంగులు చల్లుకోవడమే కాకుండా తలలపై కోడి గుడ్లు కొట్టుకున్నారు. మద్యం మత్తులో మునిగి తేలారు. మాంసం వంటలు చేసుకొని ఆరగించారు. కొందరు కుల వృత్తుల ప్రజలు హోలీ పండగ సందర్భంగా ఇనాం(ఉల్పా) వసూళ్ళు చేశారు. మహిళలు గొబ్బియ్యాలు పాడారు. పలు పార్టీల నాయకులు వాళ్ళకు తోచిన ప్రాంతంలోనే హోలీ నిర్వహించారు. రంగులు చల్లుకొని డ్యాన్స్‌లు చేశారు. పెద్ద పెట్టున నినాధాలు చేశారు.



మోర్తాడ్‌లో..



మోతెలో...

కమ్మర్‌పల్లి: మండలకేంద్రంలోని శ్రీవిద్యాసాయి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో సహజసిద్ధమైన రంగులు తయారు చేసుకుని ఒకరిపై ఒకరు పరస్పరం చల్లుకుంటు హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటు సంబురాలు జరుపుకున్నారు.

మెండోర: మండంలో పలు గ్రామాల్లో హోలీ వే డుకలను ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. బుస్సా పూర్ గ్రామంలో హోలీ సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. .యువకు లు, మహిళలురంగులు పూసుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ముప్కాల్: ముప్కాల్, బాల్కొండ మండలాల్లో ఆయా గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం కామదహనం నిర్వహించారు. హోలీ పండగకు ఒక రోజు ముందుగా పౌర్ణమి పురస్కరించుకొని కామద హనం నిర్వహించారు. శుక్రవారం మండలాల్లోని ఆయా గ్రామా ల్లో ప్రజలు హోలీ సంబరాలు జరుపుకోనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమి టీ, వార్డు కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ముప్కాల్, బాల్కొండ మండలాల్లో కామదహనం

బాల్కొండ మండలంలోని ఆయా గ్రామాల్లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి వివిధ గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కామదహనం నిర్వహించగా గురువారం స్థానిక ప్రజా ప్రతినిధులు, యువకులు, మహిళలు, చిన్నారులు ఉదయం నుంచి రంగులు చల్లుకుంటూ ఆనందోత్సహాలతో హోలీ సంబరాలు జరుపుకున్నారు.

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం రాత్రి వివిధ గ్రామాల్లో గ్రామాభివృద్ధికమిటీ ఆధ్వర్యంలో కామదహనం నిర్వహించగా గురువారం ఆయా గ్రామాలలో యువకులు, మహిళలు, చిన్నారులు ఉదయం నుంచి రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ ఆనందోత్సహాలతో హోలీ సంబరాలు జరుపుకున్నారు.

మోర్తాడ్: మండలంలోని పలు గ్రామాల్లో హోలీ పండగను ఉల్లాసంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని చతురస్ర పాఠశాల విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు హోలీ ఉల్లాసంగా జరుపుకున్నారు. విద్యార్థులు రసాయనిక రంగులు కాకుండా సాదారణ రంగులు చల్లుకున్నారు. ప్రధానవీధులగుండా ఒకరినోకరు రంగులు చల్లుకుంటూ సంబరాల్లో జరుపుకున్నారు.



ఎడపల్లిలో..



రెంజల్‌లో..



మిట్టపల్లి లో భారీ గుండు రాయిని భుజంపై ఎత్తుకున్న యువకుడు

ధర్మారం రైల్వేగేటు మూసివేత



మూసివేసిన ధర్మారం రైల్వేగేటు

నవీపేట,మార్చి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం రైల్వేగేటును రైల్వే అధికారులు గురువారం నుంచి మూసివేశారు. నవీపేట, జానకంపేట రైల్వే స్టేషన్ల మధ్యన ఉన్న 189ఏ ధర్మారం రైల్వే గేటు వద్ద అండర్ పాస్ రహదారి నిర్మాణ పనులు చేపడుతుండడంతో ఈ రైల్వే గేటును మూసివేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ గమ్యాలకు వెళ్లాలని రైల్వే అధికారులు సూచించారు.

పోచారం రైల్వేగేటు మూసివేత



పోచారం రైల్వే గేటును మూసివేసిన దృశ్యం

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని బషీర్ ఫారం గేటు వద్ద గల పోచారం రహదారిపై ఉన్న రైల్వేగేటును గురువారం రైల్వే అధికారులు మూసి వేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మిస్తున్న దృష్ట్యా రైల్వే గేటును మూసి వేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రహదారి గుండా పోచారం గ్రామానికి, పొలాలకు వెళ్ళేవారు దూపల్లి గేటు నుండి పోచారం గ్రామానికి వెళ్ళాలని సూచించారు. రైల్వే అండర్ బ్రిడ్జి పనులు 9 నుండి 12 నెలల్లో పూర్తి అవుతాయని రైల్వే అధికారులు తెలిపారు ఇందుకు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

డీపీవోను కలిసిన గ్రామ పంచాయతీ కార్యదర్శి

వేల్పూర్, మార్చి13(ఆంధ్రజ్యోతి): ఇటీవలే జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును గురువారం జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం నిజామాబాద్ (టీఎస్‌జీవోఎస్) అధ్యక్షుడు ఎం.విజయ్ కుమా ర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీపీవో శ్రీనివాస్ రావుకు పుష్పగుచ్చం అందజేస్తు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్ర మంలో వివిధ గ్రామాల పంచాయతీకార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఒంటిపూట బడులు

ముప్కాల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్య జిల్లా విద్యశాఖ అధికారుల ఆదేశాసారం రాష్ట్రంలో 2024-25 విద్యసంవత్సరంలో ఈనెల 15నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయని మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైమరీ, అప్పరి ప్రైమరీ, హైస్కూల్‌లు ప్రభుత్వం ఎయిడెడ్, ప్రైవేట్ మేనేజ్‌మెంట్ ఉదయం 8నుంచి 12.30గంటల వరకు కొనసాగుతుం దన్నారు.

భిక్కనూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం నుంచి ఒంటి పూట బడులు కొనసాగుతాయని భిక్కనూరు ఎంఈవో రాజ్‌గంగారెడ్డి గురువారం తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఈ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు

● తలకు తీవ్ర గాయం ● పోలీసులకు ఫిర్యాదు



గాయపడ్డ విద్యార్థి

భీమ్‌గల్‌రూరల్, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని ఓ ఉపాధ్యాయుడు కొట్టడంతో తలకు తీవ్ర గాయమైన ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని భీమ్‌గల్ మండలం పల్లికొండ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదే గ్రామానికి లోకాయి రిషిక్ అనే విద్యార్థి ఏడో తరగతి చదువుతున్నాడు. రోజూలాగే గత బుధవారం కూడా విద్యార్థి స్కూల్‌కు వెళ్లాడు. అయితే నోట్ పుస్తకాలు కింద పడేశాడనే కారణంతో ఉపాధ్యాయుడు భూమేశ్ విద్యార్థిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అలాగే కోపంలో రిషిక్‌కు కర్రతో ఇష్టమొచ్చినట్లు చితకబాదాడు. ఈ ఘటనలో విద్యార్థి రిషిక్ తలకు తీవ్రగాయాలై రక్తస్రావమైంది. ఇంటికి వెళ్లిన విద్యార్థి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో.. వారు వెంటనే రిషిక్‌ను చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. కాగా.. విద్యార్థి తండ్రి లోకాయి నవీన్ ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడు భూమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

మట్కా నిర్వాహకుడికి రెండు రోజుల జైలుశిక్ష

బోధన్‌రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న జమీల్‌ఖాన్ అనేవ్యక్తిపై కేసు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరుపర్చగా కోర్టు న్యాయాధికారి మట్కా నిర్వాహకుడికి రెండు రోజుల జైలుశిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమాన విధించారని బోధన పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. అలాగే పట్టణంలోని బైపాస్ రోడ్డులో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తిని కోర్టులో హాజరుపర్చగా ఒకరోజు జైలుశిక్ష విధించారని వివరించారు.

'విద్యార్థుల అభిప్రాయాలను గౌరవించాలి'

పెర్కిట్, మార్చి13(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లిలో గల నలంద పాఠశాలలో వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాధికారి రాజగంగారాం పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో స్వేచ్ఛగా మాట్లాడుతూ వారి అభిప్రాయాలు పంచుకోవాలన్నారు. కార్యక్రమానికి జబర్దస్త్ నటులు నూకరాజు, ఇమ్మానియేల్ సీరియల్ యాక్టర్ ప్రత్యుష పాల్గొని అలరించారు. విద్యార్థిని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలతో అలరించారు.

నెలాఖరులోగా వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

భీమ్‌గల్‌రూరల్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): ఈనెలాఖరులోగా ఇంటి పన్ను బకాయిలను వసూలు చేయాలని డీఎల్‌పీవో శివకృష్ణ సూచించారు. గురువారం మండలంలోని బాబాపూర్, పురాణిపేట్, బాబానగర్ గ్రామపంచా యతీలలో డీఎల్‌పీవో శివకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అవకాశాన్ని ఈనెల 31లోపు ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీవో జావిద్ అలీ, కార్యదర్శులు ప్రశాంత్, జితేందర్, రమ్య, కారోబార్‌లున్నారు.

గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం

భిక్కనూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్యం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి దివ్య విద్యార్థులకు వైద్య పరిక్షలు నిర్వహించి అవసరమైనా వారికి మందులను అందజేశారు. ఈ మేరకు వైద్యాధికారిణి మాట్లాడుతూ విద్యార్థులు తప్పకుండా వ్యక్తిగత శుభ్రత పాటించాలని, భోజనం చేసేముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘు, హెచ్‌ఈవో వెంక టరమణ, వైద్య సిబ్బంది, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి దేవాలయానికి రూ.5 లక్షల విరాళం

కామారెడ్డిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి దేవాలయ అభివృద్ధికి మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు రూ.5లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తాను ఎల్లప్పుడు ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్య క్షుడు శ్రీనివాస్, కుంబాలరవి, గోనెశ్రీనివాస్, ఉదయ్, మోటూరిశ్రీకాంత్, పం పరి లక్ష్మన్, లింగం,నరేందర్‌రావు, బాలరాజ్, రామ్మోహన్ పాల్గొన్నారు.

'ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి'

సదాశివనగర్,మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ రంజిత్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై హెల్మెట్ లేకుండా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ప్రతి ద్విచక్రవాహనదారుడు ఇంటి నుంచి బయటకు వాహ నంపై వెళ్తె హెల్మెట్ తప్పకుండా ధరించాలని తెలిపారు.

బోధకాలు వ్యాధి నియంత్రణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్

నవీపేట,మార్చి12(ఆంధ్రజ్యోతి): బోధకాలు వ్యాధి నియంత్రణపై గురువారం నవీపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ శిఖరా మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో 35వరకు బోదకాలు వ్యాధి కేసులు నమోదు అయి ఉన్నాయని అన్నారు. ఈ నెల 24నుంచి 27వరకు బోదకాలు వ్యాధిగ్రస్థులు ఉన్న ఇంటి పరిసరాలలో పలు కుటుంబాలకు చెందిన వారి నుంచి రాత్రిపూట రక్త నమూనాలను సేకరించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్ రావు, కిషన్, రాణి, పుష్ప, వినయ తదితరులున్నారు.

'పాఠశాల విద్య పునాదిలాంటిది'

పెద్దకొడప్‌గల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థికి నిజజీవితంలో పాఠశాల విద్య పునాదిలాంటిదని పెద్దకొడప్‌గల్ ఎంఈవో ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కాటేపల్లి గ్రామంలో ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఇల్లుకు పునాది ఎలాంటిదో, విద్యార్థికి పాఠశాల విద్య అలాంటిదని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు యాదవ్, శంకర్, లలిత, సునీత, సుజా త, బక్షిరాం, మంజుల, మండల ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్కా, లింగం పాల్గొన్నారు. పెద్దకొడప్‌గల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివే విద్యార్థులు రానున్న వార్షిక పరీక్షల్లో చక్కటి ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకరావాలని పాఠశాల ప్రదానోపాధాయురాలు కమల పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో 10వతరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు.

విద్యార్థులకు ప్యాడ్‌ల పంపిణీ

రామారెడ్డి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్‌లో గురువారం నారెడ్డి స్వచ్ఛంద సంస్థ 39 విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేసింది. కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ హాస్టల్ ప్రిన్సిపాల్ వనిత, నాయకులు పోతుల చిన్న భాస్కర్‌రెడ్డి, చింతకుంట కిషన్ పాల్గొన్నారు.

బినోల శివారులో మనిషి పుర్రె, ఎముకల లభ్యం



లభ్యమైన పుర్రె, ఎముకలు

నవీపేట,మార్చి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోల శివారులో గురువారం మనిషికి చెందిన పుర్రె, పలు ఎముకలు లభ్యమయ్యాయని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. మండలంలోని గాంధీనగర్‌కు చెందిన వ్యక్తులు పని నిమిత్తం బినోల అటవీ శివారుకు వెళ్లగా అక్కడ మనిషి తలకు చెందిన పుర్రె, కొన్ని ఎముకలు లభ్యమయ్యాయని ఎస్‌ఐ పేర్కొన్నారు. సంబంధిత పుర్రె, ఎముకలు పురుషుడివా, మహిళవా అనే విషయం తెలియరాలేదని ఆయన పేర్కొన్నారు. గాంధీనగర్ కారోబార్ చింతాల మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇటీవల కాలంలో మండలంలో ఎవరైనా అదృశ్యమయ్యారా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

'మెడికవర్'లో ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో ఎక్కువగా దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధిబారిన పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని ప్రముఖ మూత్రపిండాల వైద్యనిపుణులు డాక్టర్ అజయ్‌కుమార్, విశ్వంత్ పాటిల్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ మూత్ర పిండాల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ఏదైనా మూత్రపిండానికి సంబంధించిన చిన్నపాటి సమస్య ఎదురైనప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. నిత్యం మనం తినే ఆహారపు అలవాట్ల లోనూ, డీహైడ్రేషన్ వల్లనో, మధుమేహం సంబంధించిన రుగ్మతల వల్ల, ఎక్కువగా పెన్‌కిల్లర్ల వాడకం వల్ల మూత్రపిండాల సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ యజ్ఞ, యూరాలజిస్ట్ డాక్టర్ ఏ సతీష్, మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ స్వామి, మార్కెటింగ్ మేనేజర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు ప్రముఖుల హోలీ శుభాకాంక్షలు

నిజామాబాద్ అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను పురస్కరించుకొని జిల్లా ప్రజలకు ప్రముఖులు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, షబ్బీర్ అలీ, పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్, సురేష్ షెట్కార్, రాజ్యసభ సభ్యుడు సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పి.సుదర్శన్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశవేణు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డిలు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మోపాల్ : మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం హోలీ సంబరాలను యువకులు పెద్దలు మహిళలు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం రాత్రి కామదహనం చేసి గురువారం ఉదయం నుంచే హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని ముదక్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు దేవిక, ఉపాధ్యాయ బృందం భారతి, జ్యోత్స్న, ప్రేమ్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు భయం వీడి పరీక్షలకు హాజరవ్వాలి'

కమ్మర్‌పల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మరికొద్ది రోజుల్లో ప్రారంభం కాన్ను పదోవతరగతి పరీక్షలకు విద్యార్థులు భయంవీడి ప్రశాంత వాతావరణంలో రాయాలని, లక్ష్యం ఎంచుకుని పరీక్షలకు హాజరైతే విజయం తప్పక వరిస్తుందని ఐకేపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కోనాసముందర్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుపాల్, అమ్మఆదర్శ పాఠశాల కమిటి పాలక వర్గ సభ్యులు నస్రీన్, రాజేశ్వరి, పార్యాంశ బోదకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'వినియోగదారుల పరిష్కార వేదికను ఉపయోగించుకోవాలి'

సుభాష్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను వినియోగదారులు ఉపయోగించుకోవాలని చైర్మన్ ఇ.నారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పవర్‌హౌజ్ కంపౌండ్‌లో గురువారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు ఎలాంటివి ఉన్న పరిష్కార వేదిక ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఈ వేదికకు గురువారం రామకృష్ణ అనే వినియోగదారుడు ఇనుప పోల్‌ను తీసివేసి సిమెంట్ పోల్ వేయాలని కోరగా చైర్మన్ స్పందిస్తూ వెంటనే ఇనుప పోల్‌ను తీసివేసి సిమెంట్ పోల్ వేయవల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల పరిష్కార వేదిక సభ్యుడు రామకృష్ణ, కిశోర్, రాజారెడ్డి, డీఈ శ్రీనివాస్, ఏడీఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుంటుపడుతున్న గ్రామాల అభివృద్ధి

● గ్రామ పంచాయతీలకు నిధుల కటకట
● 13నెలలుగా ప్రత్యేక అధికారుల పాలన
● నిలిచిన కేంద్రం నిధులు



ఆర్మూర్‌రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పల్లెలు అభివృద్ధి పనులతో కళకళలాడాలంటే గ్రామపంచాయతీలలో పుష్కలంగా నిధులు ఉండాలి. గ్రామ పంచాయతీలలో పాలకవర్గ సభ్యులు లేక 13నెలలుగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. పాలకవర్గ సభ్యులు లేరన్న సాకుతో కేంద్రం నుంచి రావల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. దీంతో గ్రామపంచాయతీల్లో నిధులకు కటకట ఏర్పడుతుంది. గ్రామప్రజల కనీస అవసరాలు తీర్చడానికి డబ్బులు లేక పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు.

నిలిచిన కేంద్రం నిధులు.. నిర్వహణ కష్టాలు

కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు గ్రామ జనాభా ఆధారంగా ప్రతీ మూడు నెలలకోసారి కేంద్రం నిధులు మంజూరు చేస్తుంది. ఒక్కో గ్రామానికి రూ.50వేల నుంచి సుమారు రూ.4లక్షల వరకు నిధులు వచ్చేవి. ఈ నిధులతో గ్రామప్రజల అవసరాలు, సిబ్బందికి జీతాలు చెల్లించేవారు. ఏడాదికి నాలుగు సార్లు రావల్సిన నిధులు గత 13నెలల కాలంలో ప్రత్యేకాధికారుల పాలన వచ్చిన తర్వాత ఒకసారి మాత్రమే నిధులు వచ్చాయి. నాలుగు విడతల డబ్బులు నిలిచిపోవడంతో గ్రామపంచాయతీలలో డబ్బులకు కటకట ఏర్పడి అభివృద్ధి కుంటు పడింది. ఒక్కో గ్రామానికి సంవత్సరానికి రూ.3లక్షల నుంచి రూ.10లక్షల వరకు మేజర్ గ్రామపంచాయతీలైతే రూ.20లక్షల వరకు నిధులు వస్తాయి. ఆ నిధులు రాకపోవడంతో అత్య వసర పనులైన పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, తాగునీటి సరఫరా, పైప్‌లైన్ లీకేజీలు, సిబ్బంది జీతాల చెల్లింపులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తప్పని సరి పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులను వెచ్చించి పనులు నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం మల్టిపర్పస్ వర్కర్‌ల జీతాలను మాత్రమే విడుదల చేస్తుంది. అది కూడా రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామ పంచాయతీలలో ఇంటి పన్నుల వసూలు రూపంలో వచ్చిన నిధులతో అరకొర పనులు చేపడుతున్నారు.

ఆదాయం స్వల్పం.. ఖర్చులు అధికం!

గ్రామ పంచాయతీలలో ఆదాయం స్వల్పంగా ఉండి ఖర్చులు అధికంగా ఉంటున్నాయి. పన్నుల రూపంలో వసూలు డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ నిధులతో ట్రాక్టర్ ఈఎంఐ, డీజిల్, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, తదితర పనులను నిర్వహించడం బారంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులను విడుదల చేస్తే పంచాయతీల పరిస్థితి మెరగవుతుంది.

వేసవి గండం గడిచేదెలా..

గ్రామాల్లో వేసవి కాలం వచ్చిందంటే గ్రామపంచాయతీలపై అదనపు భారం పడుతుంది. తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మిషన్ భగీరథ నీరు అందుతున్నప్పటికీ వేసవిలో ఇబ్బందులు తప్పవు. స్థానికంగా ఉన్న బోర్లు ఎత్తిపోవడం, మోటర్లు కాలిపోవడం లాంటివి ఎదురైనప్పుడు ఖర్చులు తడిసిమోపేడవుతున్నాయి. గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ల ద్వారా హరితహారం చెట్లకు నీరందించాల్సి ఉంటుంది. మరోవైపు నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో నీటి సరఫరాకు ట్యాంకర్‌ను అద్దెకు తీసుకొని ప్రజలకు నీరు అందించాల్సి రావడంతో పంచాయతీలపై అదనపు భారం పడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్ఎఫ్‌సీ నిధులు గ్రామ పంచాయతీలకు మంజూరు చేస్తే పల్లెల్లో పాలన అభివృద్ధి పథంలో సాగుతుంది.

గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి..

● ఎం.విజయ్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు



గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేస్తేనే పనులు ముందుకు సాగుతాయి. అరకొర నిధులతో పనులు జరిపించడానికి ఇబ్బందిగా మారింది. పాలకవర్గం ఏర్పడితే కేంద్రం నుంచి నిధులు వస్తాయి. అనేక గ్రామ పంచాయతీలలో పనులు జరిపించడానికి పంచాయతీ కార్యదర్శులు సొంతంగా డబ్బులను వెచ్చించిన సందర్భాలు ఉన్నాయి. గ్రామపంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయడా నికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

ఫటా..ఫట్...

ఉపాధి పథకం కింద కూలీలకు పని కల్పిస్తున్నాం

● శివకుమార్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, నిజాంసాగర్



ఉమ్మడి మండలాల్లో ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పని కల్పిస్తున్నాం. పని చేసే చోట నీడ చర్యలు చేపడుతున్నాం. ఏప్రిల్‌లో కొత్త పనులు చేపడతామని ఉపాధిహామీ ప్రాజెక్టు ఆఫీసర్ (ఏపీవో) పి.శివకుమార్ ఆంధ్రజ్యోతికి వివరించారు.

ప్రశ్న: నిజాంసాగర్ మహ్మద్ నగర్ మండలాల్లో ఎంత మంది కూలీలు పని చేస్తున్నారు?

జవాబు: నిజాం సాగర్, మహ్మద్‌నగర్ మండలాలోని 27 గ్రామ పంచాయితీలో కూలీలు పని చేస్తున్నారు.

ప్రశ్న: ఉపాధిహామీ పథకం కింద ఏ పనులు చేపడుతున్నారు?

జవాబు: ఉపాధిహామీ పథకం కింద ఫిష్ ఫాండ్‌లు, కందకాలు, భూమి అభివృద్ధి, పౌల్ట్రీ షేడ్‌ను, గేదెల షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.

ప్రశ్న: ఉపాధిహామీ పథకం కింద ఎన్ని గంటలు పని చేస్తున్నారు? వారు చేసే పని విలువ ఎంత?

జవాబు: ఉపాధిహామీ పథకం కింద పని చేసే కూలీలు 11 గంటల వరకు కొలతల ప్రకారం పని చేస్తూ ఉంటారు.

ప్రశ్న: గేదెల షెడ్లు, పౌల్ట్రీ షెడ్లు ఎన్నింటినీ నిర్మాణం చేపడుతున్నారు? ఎంత ఖర్చు చేస్తున్నారు?

జవాబు: నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల్లో పౌల్ట్రీ షెడ్ 1 నిర్మాణంలో ఉందని, ఒక్కంటికి మూడు లక్షలు, గేదెల షెడ్లు, 8 నిర్మాణంలో ఒక్కొక్క షెడ్డుకు 80 వేల ఉపాధిహామీ పథకం కింద చెల్లిస్తాం.

ప్రశ్న: ఉపాధిహామీ పనులు చేసే చోట కూలీలకు తాగునీరు, నీడ ఉండేందుకు టెంట్ సౌకర్యం కల్పిస్తున్నారు?

జవాబు: ఉపాధి హామీ పనులు తాగునీరు కల్పించాం. గ్రామ పంచాయతీల ద్వారా టెంట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నాం.

●(ఆంధ్రజ్యోతి, నిజాంసాగర్)


కుస్తీలో పాల్గొన్న మల్లయోధులు


కుస్తీలో పాల్గొన్న మల్లయోధులు

దూపల్లిలో కుస్తీపోటీలు

రెంజల్,మార్చి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపల్లి గ్రామంలో హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం కుస్తీపోటీలను నిర్వహించారు. ప్రతీ సంవత్సరం హోలీ పండుగ సందర్భంగా గ్రామంలో కుస్తీపోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సీహెచ్ బాబన్న అన్నారు. కుస్తీపోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలతోపాటు కుస్తీపోటీలలో పాల్గొనేందుకు మల్లయోధులు వచ్చారు. కుస్తీపోటీలో గెలుపొందిన మల్లయోధులకు వెండి కడియంతో పాటు నగదును అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, లింగన్న యాదవ్, సీహెచ్ రాములు, భూమారెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగంపల్లిలో..

మోపాల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగంపల్లిలో హోలీ పండుగ సందర్భంగా గ్రామంలో గురువారం సాయంత్రం కుస్తీ పోటీలను నిర్వ హించారు. ప్రతీ సంవత్సరం హోలీ పండుగను పురస్కరించుకొని కుస్తీ పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్థులు తెలిపారు. ఈ కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు మండల యువకులే కాకుండా మహారాష్ట్ర నుంచి యువకులు వచ్చి కుస్తీ పోటీలో పాల్గొంటారు. కుస్తీ పోటీలను పోటా పోటీగా నిర్వహించారు. పోటీలో గెలుపొందిన యువకులకు వెండి, నగదు బహుమతిని అందజేశారు. అక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగ కుండా ఉండేందుకు ఏఎస్సై రమేష్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.


సింగంపల్లిలో కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు బదిలీ


డీఎస్పీ శ్రీనివాసులు

ఎల్లారెడ్డి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు బదిలీ అయ్యారు. గురువారం డీజీపీ ఆఫీసుకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎల్లారెడ్డిలో రెండు సంవత్సరాల తొమ్మిది నెలల పాటు విధులు నిర్వహించారు. ఆయన శాంతిభద్రతల పరిరక్షణకు ఎంతో కృషి చేశారు. కాగా సూర్యాపేట సైబర్ క్రైమ్ డీఎస్పీగా పనిచేస్తున్న శ్రీనివాస్ ఎల్లారెడ్డికి రానున్నారు. ఈయన గతంలో కామారెడ్డి జిల్లాలో కూడా పనిచేశారు. బదిలీ అయిన సందర్భంగా డీఎస్పీ శ్రీని వాసులును స్థానిక ప్రజాప్రతినిధులు వ్యాపారులు సిద్ది శ్రీధర్ , గౌలపల్లి మ ల్లేష్, రాజాగౌడ్, రాజుయాదవ్ వివిధ పార్టీ ప్రజా ప్రతినిధులు తదితరు లు శాలువాతో ఘనంగా సన్మానించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

ఆర్మూర్‌రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని మినీ స్టేడియంలో రాష్ట్రస్థాయి పురుషుల హాకీ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు ఎంపిక చేసినట్టు జిల్లా హాకీ సంఘం అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, ప్రధానకార్యదర్శి సదామస్తుల రమణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16వ తేదీ నుంచి కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో జరగనున్న అంతర్ జిల్లాల పురుషుల హాకీ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి కొండ్ర అంజు, ఈసీ సభ్యుడు సడాక్ రాజేష్, నర్సింగ్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.


జిల్లా హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

రంగుల పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

● ఇష్టం లేని వారిపై రంగులు చల్లితే కఠిన చర్యలు
● బెట్టింగ్ నిర్వహణపై కఠినంగా వ్యవహరిస్తాం ● విలేకరులతో సీపీ సాయిచైతన్య


మాట్లాడుతున్న సీపీ. సాయిచైతన్య

ఖిల్లా, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రంగుల పండుగ హోలీ సంబరాలను అందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసు కమిషనర్ సాయిచైతన్య అన్నారు. పోలీసు కమిషనరేట్ కమాండ్ కంట్రోల్ హాల్‌లో గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. రంగుల పండుగలో కేవలం సహజసిద్ధమైన (నేచురల్) రంగులనే వాడాలన్నారు. ఇతరత్ర రసాయనాలు (కెమికల్స్) కలిపిన రంగులతో ప్రమాదం ఉండే అవకాశాలుంటాయన్నారు. హోలీ పండుగ, పవిత్ర రంజాన్ రెండవ శుక్రవారం ఒకే రోజు రావడంతో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలిగించకుండా పండుగను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. ఇష్టం లేని వారిపై రంగులు జల్లితే ఫిర్యాదుల నేపధ్యంలో వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. సిటీ పోలీసు యాక్ట్ 22ప్రకారం శిక్షకు గురవుతారన్నారు. పండుగ సంబరాల్లో బాగంగా కొందరు ఆకతాయిలు రాష్ డ్రైవింగ్‌కు పాల్పడుతుంటారని, అటువంటి వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పండుగల్లో సీసీ కెమారాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎక్కడైతే సీసీ కెమారాలు పని చేయడం లేదో వాటిని వెంటనే మరమ్మత్తులు చేయించి అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్యం దుకాణాలను సైతం మూసి ఉంచడం జరుగుతుందన్నారు.పండుగ సందర్భంగా ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా అన్ని చోట్ల వాహనాల తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా యువత బెట్టింగ్‌కు బానిసలై తమ జీవితాలను నాషనం చేసుకుంటున్నారు, అటువంటి వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు వారి జీవితాలకు ఒక దారి చూపడానికి యత్నిస్తామన్నారు.

శంభులింగేశ్వర ఆలయ హుండీ లెక్కింపు

నిజామాబాద్ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అతిపురాతనమైన శంభులింగేశ్వర ఆలయ హుండీని గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హుండీ లెక్కింపు సహాయ కమిషనర్ విజయ రామారావు పర్యవేక్షణలో జరిగింది. హుండీ లెక్కింపులో ఆలయానికి రూ.1,09,815 ఆదాయం సమకూరినట్లు కార్యనిర్వాహణ అధికారి రాములు తెలిపారు. ఆదాయంలో 95,755నోట్ల రూపంలో రాగా రూ.14,060 నాణేల రూపంలో వచ్చినట్లు తెలిపారు.

ఆసరా పింఛన్ల పెంపు ఎప్పుడో..!?

మద్నూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది పూర్తయిపోయినా ఆసరా పెన్షన్ల పెంపుపై ఊసెత్తడం లేదని పెన్షన్ లబ్ధిదారులు వాపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2016 పెన్షన్ ఇవ్వగా తాము అధికారంలోకి వస్తే ఆసరా పెన్షన్లు రెండింతలు చేస్తాం, కుటుంబంలో ఇద్దరి సమానంగా పెన్షన్లు ఇస్తామని 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. కాని ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడి చిపోయిన వాగ్దానం అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వస్తున్న పెన్షన్ తమ అవసరాలకు ఎంతగానో ఉప యోగ పడుతున్నాయని, ప్రస్తుతం నిత్యావసరాల ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ పెన్షన్ డబ్బులు ఏమాత్రం సరిపోవడం లేదని పెన్షన్ దారులు పేర్కొంటున్నారు. పెన్షన్ డబ్బులను ప్రభుత్వం ఎప్పుడు పెంచుతుందోనని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చే పెన్షన్ పెంచాలని వారు కోరు తున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో మొత్తం 9780 మంది పెన్షన్‌దారులు ఉన్నారు. వారిలో వృద్ధులు 4940, వితంతువుల 3378, వికలాంగులు 1191, ఒంటరి మహిళలు 214, బీడీ కార్మికులు 37 ఉండగా వారికి ప్రతినెల ప్రభుత్వం రెండు కోట్ల 19 లక్షల 62 వేల 656 పెన్షన్ అందజేస్తుంది.


మద్నూర్ పోస్టాఫీసు వద్ద పెన్షన్‌దారులు

● ఉమ్మడి మద్నూర్ మండలంలో ఆశతో లబ్ధిదారుల ఎదురుచూపులు

2023 సంవత్సరం ఎన్నికల హామీల్లో భాగంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలులో నిమగ్నమైన ప్రభుత్వం పెన్షన్ పెంపు విషయం మర్చిపోయిందని పెన్షన్‌దారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో కొలువు దీరిన ప్రభుత్వం తమ పెన్షన్లు పెంచుతుందని ఎన్నో ఆశలు ప్రభుత్వంపై పెట్టుకున్నామని పెన్షన్‌దారులు పేర్కొంటున్నారు. వృద్ధులకు ఇచ్చే పెన్షన్ రూ.2016 నుంచి రూ.4016కు, వికలాంగుల పెన్షన్ రూ.4016 నుంచి రూ.6016 పెంచి ఇస్తారని కాంగ్రెస్ నాయకులు ఆశలు రేకెత్తించారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు తీర్చినట్లుగానే ఆసరా పెంచి ఆదుకోవాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఈజీఎస్ సామాజిక తనిఖీపై ప్రజా వేదిక


మోర్తాడ్ ఈజీఎస్ ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్

మోర్తాడ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఈజీఎస్ కార్యాలయం వద్ద గురువారం 16వ విడత సామాజిక తనిఖీపై ప్రజా వేదిక నిర్వహించారు. ఈ ప్రజావేదికకు ఎంపీడీవో తిరుమల అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రజావేదికలో గ్రామాల వారీగా నిర్వహించి సామాజిక తనిఖీలో ఆడిట్ చేసిన సభ్యులు నిష్పక్షపాతంగా అడిట్ రిపోర్టును చదివి వినిపించారు. పలు గ్రామాలో వందలాది మొక్కలు చనిపోవడం, తక్కువ రోజులు పని చేస్తే ఎక్కువ రోజులు డబ్బులు చెల్లించడం, లక్షల రూపాయతో నిర్మించిన నీటి ట్యాంకుల పనులకు ఫోటోలు ఇవ్వలేదని అడిట్ సభ్యులు ఆరోపించారు. సుంకెట్‌లో కూలీలకు సరిపడ డబ్బులు ఇవ్వలేదని, నాలుగు వేల మొక్కలు అడ్రస్ లేదని, ఒక కుటుంబానికి ఒక జాబ్‌కార్డు ఇవ్వాల్సి ఉండగా రెండు కార్డులు మంజూరు చేశారని ఆడిట్ సభ్యులు వివరించగా అధికారులు మౌనం వహించారు. సంతకాలు లేకున్న వేలాది రూపాయలు చెల్లించినట్టు వెల్లడైంది. ఉపాధి పనులు ఒకరి మీద మరోకరు పని చేసి డబ్బులు తీసుకున్నట్టు వెల్లడైంది. పాలెంలో 615మొక్కలు చనిపోయాయని, తనిఖీ బృందానికి రికార్డులు ఇవ్వలేదని, ఆడిట్ చేసిన సభ్యులు పీడీ దృష్టికి తీసుకువచ్చారు. పలు గ్రామాలలో అవకతవకలు జరిగిన అధికారులు పట్టించుకోకపోవడం కనిపించింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వాడివేడిగా మాల్తుమ్మెద మహాజన సభ


మహాజన సభలో సొసైటీ జమ, ఖర్చు వివరాలను చదివి వినిపిస్తున్న సీఈవో

నాగిరెడ్డిపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్తుమ్మెద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ వాడివేడిగా కొనసాగింది. గురు వారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ మహాజన సభ సొసైటీ అధ్యక్షులు దుండిగళ్ల నర్సింలు అధ్యక్షతన జరిగింది. ఈ మహాజన సభలో 2024-25 ఆర్థిక సంవత్సరం జమ ఖర్చుల వివరాలను సొసైటీ సీఈవో సందీప్ సభలో చదివి వినిపిస్తుండగా పలువురు రైతులు వివిధ ఖర్చుల విషయమై సీఈవోను ప్రశ్నించారు. గోపాల్‌పేట్ గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో గోదాం షెడ్‌ల నిర్మాణం, సీసీ రోడ్డు, మిషన్ భగీరథ ప్యాచ్ వర్క్‌ల పనుల కోసం 16 లక్షల 78 వేల రూపా యలు వెచ్చించడం పట్ల, 2025 సంవత్సరం సొసైటీ క్యాలెండర్ల కోసం 36 వేల రూపాయలు వెచ్చించడం పట్ల తదితర అంశాలపై పలు రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను సొసైటీలో రూ.17 కోట్ల 13 లక్షల 30 వేల 313 ఖర్చు లెక్కలను సీఈవో సందీప్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు రాంచంద్రారెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సిద్దయ్య, నా యకులు రాజిరెడ్డి, సొసైటీ డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, వంశీకృష్ణగౌడ్, మండలంలోని వి విధ గ్రామాల డైరెక్టర్లు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు.. ఎండుతున్న పంటలు

● ఎత్తిపోతున్న బోర్లు ● ఆందోళనలో రైతులు

లింగంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయి. బోరుబావులు ఎత్తిపోతున్నాయి. దీంతో పంటలు ఎండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని నల్లమడుగు, లింగంపల్లి, ఒంటర్ పల్లి, సురాయిపల్లి, పొల్కంపేట, శెట్పల్లిసంగారెడ్డి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో పంటలు ఎండుతున్నాయి. మండలంలోని ఒంటర్‌పల్లికి చెందిన రైతు ప్రభాకర్ రెడ్డి రెండు ఎకరాలలో వరి నాటు వేయగా పంట ఎండుతుండడంతో పంటను కా పాడుకునేందుకు ఇటీవల రెండు బోరుబావులు వేయించగా చుక్క నీరు పడలేదు. ఎండిన పంటను మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ పరిశీలించారు. బోరుబావులలో నీరు తగ్గినందున ఇబ్బందులు వస్తున్నాయని, రైతులు బోరు బావులను రాత్రి పగలు నడిపి నీటిని వృథా చేయకుండా అవసరం మేరకే నీటిని వాడుకుని పంటలను కాపాడుకోవాలని ఆయన రైతులకు సూచించారు.


ఒంటర్‌పల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి(ఫైల్)



సీడీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

17, 18న అంగన్‌వాడీల ధర్నా

బాన్సువాడ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని సీడీపీవో కార్యాలయంలో గురువారం ప్రాజెక్టు అధికారి మహాదేవికి అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు జె.రవీందర్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17, 18న కామారెడ్డి కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖలీల్, అరుణ, బాలమణి తదితరులున్నారు. మణి తదితరులున్నారు.

ప్రధాన కాలువలోకి స్నానాలకు వెళ్లొద్దు

బీర్కూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి పంటల నిమిత్తం గురువారం సాయంత్రం సాగు నీటిని విడుదల చేస్తున్నారని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శుక్రవారం హోలీ పండుగ సందర్భంగా ప్రధాన కాలువలో స్నానాలు చేయడానికి యువకులు, చిన్న పిల్లలు వెళ్లే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు, అధికారులు, ప్రజలు కాలువలో స్నానాలకు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పశువైద్య శిబిరాల ఏర్పాటుకు సన్నాహాలు

మద్నూర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య ఆదేశించారు. గురువారం మద్నూర్ మార్కెట్ యార్డులో డైరెక్టర్లతో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై చర్చించారు. మద్నూర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మద్నూర్, జుక్కల్, డోంగ్లి మూడు మండలాల్లో పశువులకు ఉచితంగా చికిత్స చేయడానికి శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్కెట్‌కు రైతులు ధాన్యం తీసుకొస్తుండగా వారికి సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అదేవిధంగా మార్కెట్ యార్డులు రైతులకు అవసరమైన షెడ్లను ఇవ్వడానికి నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పరమేష్, కార్యదర్శి శ్రీకాంత్, సిబ్బంది పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

నసురుల్లాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈ శ్రావణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు వివరాలను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అందుబాటులో ఉండాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఈలు గంగాధర్, నాగరాజు, ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ అరవింద్, విద్యుత్ అధికారులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయురాలికి శిరోమణి అవార్డు

నసురుల్లాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 2025మహిళా శిరోమణి అవార్డును నసురుల్లాబాద్ జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు మల్లెపూల ఇందిరా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం రాత్రి హైదరాబాద్‌లో అవార్డును అందుకున్నానన్నారు. ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

రైతుందరికీ రుణమాఫీ చేయాలని తీర్మానం

భిక్కనూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రైతులందరికీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని భిక్కనూరు మండలంలోని అంతంపల్లి విండో పాలకవర్గం సభ్యులు తీర్మానం చేశారు. గురువారం విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విండోలో రుణాలు తీసుకున్న రైతులకు షైర్ క్యాపిటల్‌పై పది శాతం డివిడెంట్‌ను నదగు రూపంలో అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విండో ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, డైరెక్టర్లు, విండో సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించాలి

భిక్కనూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్ డిమాండ్ చేశారు. గురువారం భిక్కనూరులో ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువస్తామని, అధిక నిధులు కేటాయిస్తామని హామీలిచ్చి అధికారంలోకి రాగానే విద్యారంగం పట్ల సవితితల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. రాష్ట్రంలో పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్దఎత్తున ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఎండీ సమీర్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ఘనంగా కుమ్మర మొల్ల జయంతి

బీర్కూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని కుమ్మర సంఘం భవనంలో గురువారం కుమ్మర మొల్ల 585వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కుమ్మర మొల్ల చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మర సంఘం అధ్యక్షుడు బాలయ్య, శ్రీనివాస్, హన్మాండ్లు, రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనాన్ని అందజేయాలి

బాన్సువాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందజేయాలని ఎంపీడీవో బషీరుద్దీన్ అధికారులను ఆదేశించారు. బాన్సువాడ మండలం బోర్లం మైనార్టీ గురుకుల పాఠశాలను గురువారం బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నూతన మధ్యాహ్న భోజనాన్ని మెనూ ఏ విధంగా అందుతుందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన స్టాక్ రికార్డులను వంట గదులను ఆయన పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పన వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాలుగా మధ్యాహ్న భోజనం మెనూ అందజేయాలన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, సెక్రెటరీలు సృజన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న డైరెక్టర్

గాంధారి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రాథమిక సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా డైరెక్టర్ సాయికుమార్, ఏఎంసీ చైర్మన్ పరమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు నష్టపోకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. శనగ పంటను పండించిన రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవ్, కార్యదర్శి సాయిలు, వైస్ చైర్మన్ ఉద్దల్‌సింగ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా కామ దహన వేడుకలు



బీర్కూర్‌లో కామ దహనం చేస్తున్న గ్రామస్థులు

బీర్కూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల ప్రజలు గురువారం కామ దహనం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. హోలీ పండుగకు ఒక రోజు ముందు రాత్రి కాముని దహనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా బీర్కూర్ మండల కేంద్రంలో ప్రధాన వీధుల్లో, ఆయా కాలనీలవాసులు కాముని దహనాన్ని నిర్వహించారు. పిడకలతో కట్టెలను పేర్చి నెయ్యిని పోస్తూ కామదహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో వేడుకలను నిర్వహించారు. శుక్రవారం మండల వ్యాప్తంగా హోలీ పండుగ వేడుకలను జరుపుకోనున్నారు. హోలీ పండుగను యువకులు, విద్యార్థులు ఘనంగా జరుపుకునేందుకు సంసిద్ధమయ్యారు.

పెద్ద కొడప్‌గల్: కామదహనం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో డప్పులతో ఊరేగింపు నిర్వహించారు. ప్రతీ ఇంటి నుంచి పిడకలు, బొబ్బర్లు వంటి వాటిని సేకరించి గ్రామాల్లోని కూడళ్లలో కామ దహనం నిర్వహించారు. బొబ్బర్లను కామదహనం కోసం వేసిన మంటల్లో ఉడికించి ప్రతీ ఇంటికి ఉదయం పంచుతారు. రాత్రి సమయంలో కామదహనం చేసి ఉదయాన్నే హోలీ పండుగ జరుపుకుంటారు.

మద్నూర్: నిండు బిందెలతో.. బోనాలతో మహిళలు కాముడికి నీళ్లు పోసి భక్తిశ్రద్ధలతో కామ దహనం చేశారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో కామ దహనం కార్యక్రమాలు జరిగాయి. హోలీ పండుగ సందర్భంగా రంగులు చల్లుకొనే ఒక రోజు ముందు రాత్రికి కామ దహనం జరపడం ఆనవాయితీ. మండల కేంద్రంలోని గాంధీచౌక్, ఎల్లమ్మగల్లి, తులా వారి గల్లీలతో పాటు ఆయా కాలనీల్లో గురువారం కామ దహనం చేశారు. ఆనవాయితీగా వస్తున్న గ్రామ కామ దహనం కోసం పేడ పిడకలు, కట్టెలు పోగు చేసి కుప్పగా పోసి పౌర్ణమి రోజు రాత్రి మహిళలు నిండు బిందెలతో తీసుకొచ్చిన నీళ్లను కాముడి చుట్టూ పోసిన తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించి నిప్పంటించారు. మానవులు ఇంద్రియాలు నియంత్రించడానికి కామ దహనం చేస్తారని నీతి బోధిస్తోంది. అదేవిధంగా శుక్రవారం రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలు చేసుకోవడానికి ఏర్పాట్లు చేశారు.

రామారెడ్డి: కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట్, మద్దికుంట, అన్నారం, పోసానిపేట్, గొల్లపల్లి, ఇసన్నపల్లి, కన్నాపూర్, మోషంపూర్, కన్నా పూర్ తండా, స్కూల్ తండా రమన తండా, కన్నాపూర్ తండా, గోకుల్ తండా తదితర గ్రామాల్లో, తండాల్లో కామ దహనాన్ని నిర్వహించారు. హోలీ పండుగ వేడుకలను గురువారం ఉదయం విద్యార్థులు నామ మాత్రంగా ఒకరి పై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకొని సంబరాలు నిర్వహించారు. పోలీసుల బందోబస్తు మధ్య కామ దాహం నిర్వహించారు.

లింగంపేట: మండలంలోని ఐలాపూర్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయలు హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు రంగులు చల్లుకుని సంతోషాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హోలీ పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దామోదర్, ఉపాధ్యాయులు శివనంద, లావణ్యలతో పాటు విద్యార్థులు ఉన్నారు.



మద్నూర్‌లో..



కామారెడ్డిలో..



రామారెడ్డిలో..



ఐలాపూర్‌లో..

ఉపాధిహామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో



ముస్తాపూర్‌లో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

బీబీపేట,మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సానగర్ గ్రామ పంచాయతీ పరిధిలో పంట పొలాలకు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ పరిశీలించారు. ఈ రోడ్డు నిర్మాణ పనుల వల్ల రైతులకు జరిగే లాభాలను తెలిపారు. గ్రామంలో ఉపాధి కూలీలను పనిలో భాగస్వామ్యులను చేయాలని ఆయన సూచించారు. నర్సరీని పరిశీలించి పూలు, పండ్ల మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని తెలిపారు. మండలంలోని శివారు రాంరెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ గృహ నిర్మాణం లబ్ధిదారులకు సంబంధించిన గృహ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలో జరుగుతున్న పనులలో ప్రతీ కూలీకి పనులు కల్పించాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలోని ప్రతీ కూలికి పని కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని కూలీలు పనులు చేస్తున్న చోట సౌకర్యాలు కల్పించానలి ఆయన సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు.

ఘనంగా కవిత జన్మదిన వేడుకలు



బాన్సువాడలో కేక్‌కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్సీ కవిత జన్మదిన సందర్భంగా మున్సిపల్ వైస్‌చైర్మన్ జుబేర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జుబేర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో, అభివృద్ధిలో అధినేత కేసీఆర్ వెన్నంటి నిలుస్తూ ప్రజల పక్షానా నిలబడుతున్న ఎమ్మెల్సీ కవితకు హార్థిక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మొచ్చి గణేష్, సాయిబాబా, సాకలి మహేష్, రమేష్ యాదవ్, శివ సూరి, అనిల్, జావిద్, సంజయ్ తదితరులు ఉన్నారు.

నిజాంసాగర్: ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు సందర్భంగా ఉభయ జిల్లాల జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ డి. రాజు హైదరాబాద్‌లోని కవిత నివాసంలో కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందించారు. ఎమ్మెల్సీ కవిత మరెన్నో పుట్టినరోజులు జరుపుకుంటూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కవిత జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహులు గౌడ్, ఎజాజ్, గణేష్, మంగలి సాయి, అల్లం రాములు, టేకుర్ల సాయి తదితరులు పాల్గొన్నారు.



మైనర్లకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమణ

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

● కామారెడ్డి రూరల్ సీఐ రమణ

రామారెడ్డి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కామారెడ్డి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు విద్యార్థులు, మహిళలు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే వారితో పాటు తల్లిదండ్రులకు సదరు వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాయంత్రం వాహనాల తనిఖీల్లో వాహనాలను తనిఖీ చేసి, డ్రైవింగ్ లైసెన్స్ సర్టిఫికెట్లు ఉండాలని కోరారు. నూతన ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, సురక్షితంగా గమ్యస్థానం చేరుకోవాలని పలు సలహాలు సూచనలు పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రవీందర్, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

రామారెడ్డి: మండల కేంద్రంలో సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలో పంతులమ్మ అభిషేకాలు, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, వైద్యులు, వ్యాపారులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



లింగంపేటలో ప్రమాణం చేస్తున్న సమాఖ్య సభ్యులు

మండల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక

లింగంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. గురువారం సెర్ప్ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అధ్యక్షురాలిగా గడ్డం సులోచన (మోతె), ప్రధాన కార్యదర్శిగా భీమవ్వ (పొల్కంపేట), కోశాధికారిగా భాగ్యలక్ష్మి (సజ్జన్‌పల్లి)లను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నిక నిర్వాహణ కోసం నాగిరెడ్డిపేట ఏపీఎం జగదీశ్‌కుమార్ ఎన్నికల నిర్వాహణ అధికారిగా వ్యవహరించినట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో సీసీలు మన్సూర్, నజీర్, శ్రావణ్, స్వప్న, మేహర్, అంజయ్య గంగరాజు, రాజిరెడ్డిలతో పాటు సిబ్బంది ఉన్నారు.

సదాశివనగర్‌లో రోడ్డు విస్తరణ పనులు

సదాశివనగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఎన్నో నెలలుగా ఎదురు చూస్తున్న సదాశివనగర్ మండల కేంద్రంలోని ప్రజల కలలు సాకారమవుతుండడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో రోడ్డు ఇరుకుగా ఉండడంతో రోడ్డు విస్తరణ పనులు నాయకులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ పనులకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు నిధులు విడుదల చేయడంలో కృషి చేశారని మండల ప్రజలు పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

పెద్ద కొడప్‌గల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపల్లి గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. జగన్నాథపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. అయితే రోడ్డు నిర్మించే ప్రాంతంలో ఈ స్థలం తమదంటే తమదే అని ఇరువర్గాల మధ్య ఘర్షణ ప్రారంభమైంది. మాటా మాటా పెరిగి రెండు వర్గాల వారు రెచ్చిపోయి ఇటుకలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఓ మహిళకు తలకు గాయం కాగా చికిత్స నిమిత్త ఆసుపత్రికి తరలించారు. విషయం పోలీసులకు తెలియడంతో ఎస్ఐ మహేందర్ ఘటనాస్థలికి చేరుకుని ఘర్షణకు కారణమైన పరిస్థితిపై విచారణ చేపట్టారు. ఈ విషయం గురించి ఎస్ఐ మహేందర్‌ను వివరణ కోరగా తమపై దాడి చేశారంటూ ఉషార్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

హత్యకేసులో నిందితుడికి జీవితఖైదు

కామారెడ్డి టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానాను జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ వేశారని ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. 2020 అక్టోబరు 17న నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెద గ్రామానికి చెందిన కర్రె రామకృష్ణయ్యకు కర్రె రాజయ్యకు మధ్యలో భూమికి సంబంధించిన గొడవలు ఉన్నాయని ఈ గొడవ విషయంలో పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుతుండగా కర్రె రాజయ్య రామకృష్ణ తలపైన, నడుంపైన కర్రతో కొట్టగా అతనిని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అభియోగ పత్రం దాఖలు చేయడం జరిగిందని కేసు విచారణ కొనసాగించిన న్యాయమూర్తి శుక్రవారం నిందితుడైన కర్రె రాజయ్యకు జీవితఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధించాడని తెలిపారు.

వాహనాల తనిఖీలో 10 మందికి జరిమానా

లింగంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమడుగు ఎక్స్ రోడ్ వద్ద గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేసి 10 మందికి జరిమానా విధించినట్లు ఎస్సై వెంకట్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా వాహనాలపై ఉన్న పెండింగ్ చాలన్‌లను పరిశీలించి వెంటనే చెల్లించాలని సూచించారు. హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న పట్టించుకోకుండా తిరుగుతున్న 10 మంది వాహనదారులకు జరిమానాలు విధించినట్లు ఎస్సై తెలిపారు. ఆయన వెంట సిబ్బంది శంకర్, హమీద్, మదన్ లాల్‌లతో పాటు సిబ్బంది ఉన్నారు.

చెరువులో పడి మహిళ మృతి

లింగంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముంబాజీపేట గ్రామానికి చెందిన కాశవ్వ(60) చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకట్‌రావు తెలిపారు. ఆమె గత కొంత కాలంగా కుడికాలి నొప్పితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.పలు ఆసుపత్రుల్లో వైద్యం అందించినా తగ్గకపోవడంతో ఆమె జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. మృతురాలి కుమారుడు కాశీరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలంలోని ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన చిట్కురి దేవయ్య(55) అనే వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు దేవునిపల్లి ఎస్ఐ రాజు తెలిపారు. దేవయ్య గత నాలుగు సంవత్సరాల నుంచి కడుపునొప్పితో బాధపడుతూ పలు ఆసుపత్రులు తిరుగుతున్న,మందులు వాడుతున్న ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో నిత్యం బాధపడుతూ ఉండేవాడు.గురువారం ఉదయం పొలం వద్దకు పంటకు నీరు పెట్టెందుకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. అటువైపుగా వెళ్తున్న దేవయ్య అన్న కొడుకు ప్రణీత్ దేవయ్య చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకోవడం గమనించి మృతుని భార్యకు సమాచారం అందించాడని తెలిపారు. మృతుడి భార్య చెట్కురి భాగవ్వ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఎల్లారెడ్డి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలం సబ్దల్పూర్ గ్రామానికి చెందిన గడ్డం పోచయ్య హోలీ పండుగ సందర్భంగా మటన్ తీసుకెళ్లేందుకు ఎల్లారెడ్డికి వచ్చారు. మటన్ తీసుకుని తిరిగి వెళుతుండగా గాంధీచౌక్ వద్ద ఎదురుగా ఆటో అతి వేగంగా వచ్చి పోచయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆయన మృతి చెందారు. ఈ ఘటనపై మృతుడి అన్న కుమారుడు గడ్డం లచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలి

● గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భిక్కనూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో భీంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించి తిప్పాపూర్ ప్రిమియం లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన మెదక్ జిల్లా నార్సింగి మండలం జప్తిశివనూర్, తిప్పాపూర్ జట్లకు మొదటి, రెండవ బహుమతులతో పాటుగా మొదటి బహుమతిగా రూ.15వేలు, రెండవ బహుమతిగా రూ.10వేలను అందజేశారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యువకులు విద్యతో పాటుగా క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. టీపీఎల్‌ను విజయవంతంగా నిర్వహించిన భీంరెడ్డిని ఈ సందర్భంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - కింగ్‌స్టన్
ప్రియా 70 - రిటర్న్ ఆఫ్ దా డ్రాగన్
ప్రియా 35 - ఛావా

బాన్సువాడ

మహేశ్వరి - మజాకా
వెంకటేశ్వర - దిల్‌రూబా

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

